క్లుప్తంగా

నేడు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కందుకూరు: మండల కేంద్రంలోని సామ నర్సింహారెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుప్పల వెంకటేశ్ అన్నారు. శుక్రవారం ఆయన కందుకూరులో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. ఆయా సంఘాల ప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లేపల్లి కృష్ణ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, శ్రీనివాస్‌చారి, జిల్లా అధ్యక్షుడు యాచారం జంగయ్య, ఎంఎస్‌పీ అధ్యక్షుడు గానుగపేట జంగయ్య, నాయకులు దుర్గాప్రసాద్, రాజు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ బీజేపీ నూతన కార్యవర్గ సభ్యులుగా నియమితులైన ప్రతినిధులకు మున్సిపల్ అధ్యక్షుడు టి.మనోజ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యక్షులుగా పెబ్బేటి నాగార్జున, ఎం.శ్రీకాంత్ గౌడ్, సుమిత్, ఆకాశ్ సింగ్, ప్రధాన కార్యదర్శులుగా ఎ.సంతోశ్, జి.శ్రీకాంత్, కార్యదర్శులుగా షేర్ సింగ్, జి.ఆకాశ్, జి.జ్ఞానేశ్వర్ బిరదారి, శివరంజని, కోశాధికారిగా ఎ.లావణ్య, సభ్యులుగా పి.పద్మ, సునీల్ శర్మ, జ్యోతి, శ్రీనివాస్, శ్రవణ్, రాహుల్ వర్మ, ఎ.రమేశ్, బి.రాకేశ్, పవన్, ముఖేశ్ తదితరులను పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్ గౌడ్ ప్రకటించారని తెలిపారు. ప్రతీ కార్యకర్త బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

ఆలయ పాలక మండలి నియామకానికి దరఖాస్తుల

సాక్షి ఎఫెక్ట్..

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని జెన్నాయిగూడ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పాలక మండలి నియామకానికి దేవాదాయ ధర్మదాయ శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు శుక్రవారం ఆలయ ఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆసక్తి ఉన్న వారు శనివారం నుంచి సెప్టెంబర్ 17 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.


క్రీడాప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు



క్రీడా ప్రాంగణం పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

బడంగ్‌పేట్: మున్సిపల్ పరిధిలోని సిరిపురం యాదయ్య క్రీడా ప్రాంగణంలో శుక్రవారం శానిటేషన్ సిబ్బంది పిచ్చి మొక్కలు, చెత్త తొలిగించారు. వాకర్స్ క్లబ్ నిర్వాహకులు క్రీడా ప్రాంగణం శుభ్రం చేసేందుకు పూనుకుని గురువారం పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని అందుకే తామే తొలగిస్తున్నామన్నారు. ఈ మేరకు అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ‘సాక్షి’ కథనంపై స్పందించిన మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బందికి బడంగ్‌పేట్ వాకర్స్ క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చెత్తను తరలించాలి



రఘుప్రసాద్‌తో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, పరుమార్లు శానిటేషన్ సిబ్బందికి వివరించినా పట్టించుకోవడం లేదని శానిటేషన్ అదనపు కమిషనర్ రఘుప్రసాద్‌కు కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని పలు కాలనీలో ఎక్కడిక్కడే చెత్త పేరుకుపోవడంతో ఆయా ప్రాంతాలన్నీ దుర్గంధంగా మారుతున్నాయన్నారు. పేరుకపోయిన చెత్త కుప్పలను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా గణపతి పూజలు

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గంలోఏర్పాటు చేసిన గణనాథుడి మండపాలవద్ద పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బాలపూర్‌గణేశ్ వద్ద పలువురు నాయకులు, సినీ తారలు ప్రత్యేక పూజలు చేశారు.

– మహేశ్వరంజోన్ బృందం



తుక్కుగూడ: రావిర్యాలలో..



బండగ్‌పేట: బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి దంపతులు



బడంగ్‌పేట్: బాలాపూర్ గణనాథుడి సేవలో మాజీ ఎమ్మెల్యే టీకేఆర్



బడంగ్‌పేట్: బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న సినీ హీరో మంచు మనోజ్



బడంగ్‌పేట్: వీరాంజనేయ భక్త సమాజం గణనాథుడి సన్నిధిలో కమిటీ సభ్యులు

యూజీడీ ఔట్‌లెట్ పనులు ప్రారంభించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాయి సామ్రాట్‌నగర్ కాలనీవాసులు

మీర్‌పేట: భూగర్భ డ్రైనేజీ ఔట్‌లెట్ పనులను ప్రారంభించాలని మీర్‌పేట కార్పొరేషన్ సాయి సామ్రాట్‌నగర్ వాసులు శుక్రవారం మాజీ కార్పొరేటర్ అనిల్‌యాదవ్‌తో కలిసి కార్పొరేషన్ కమిషనర్ నాగమణికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో గతంలోనే భూగర్భ డ్రైనేజీకి సంబంధించి ఔట్‌లెట్ నిర్మాణం కోసం నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తిచేసినా పనులు ప్రారంభించలేదని కాలనీవాసులు వాపోయారు. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, త్వరితగతిన ఔట్‌లెట్ పనులు ప్రారంభించేలా చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం డీఈ వేణుగోపాల్ కాలనీలో పర్యటించి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దార్ల మధు, ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, కోశాధికారి భాస్కర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కల్యాణ్, పూర్యానాయక్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే రోడ్లన్నీ చిత్తడే



బురదమయంగా మారిన తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు

మహేశ్వరం: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాల రోడ్లు చిత్తడిగా మారాయి. దీంతో నడిచేందుకు సైతం వీలు లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. మండల పరిధిలోని తుమ్మలూరు–మహేశ్వరం వరకు రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. తుమ్మలూరు గేటు(శ్రీశైలం జాతీయ రహదారి) నుంచి తుమ్మలూరు శివారు వరకు బీటీ డబుల్ రోడ్డును నిర్మించారు. మరోవైపు కాకి ఈశ్వర్ ఫంక్షన్‌హాల్ నుంచి మహేశ్వరం మండల కేంద్రం వరకు 500 మీటర్ల రోడ్డును అసంపూర్తిగా వదిలేయడంతో వర్షానికి అధ్వానంగా తయారయింది. కాంట్రాక్టర్ త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. నాగారం ప్రధాన రోడ్డు సైతం గుంతలుగా మారింది. మన్సాన్‌పల్లి చౌరస్తాలో రోడ్డు గుంతలుగా మారి బురదమయమయింది. మండలవ్యాప్తంగా తదితర రోడ్లపై వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. అధికారులు స్పందించి వాటికి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరం చేస్తున్న శీలంగోపి

నాగోలు: రక్తదానం ప్రాణదానంతో సమానమని కొత్తపేట డివిజన్ శ్రీ శివగంగ కాలనీవాసి, సామాజిక సేవకు శీలంగోపి అన్నారు. శుక్రవారం శ్రీ శివగంగ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ఆదుకున్న వారు ప్రాణ బంధువులు అవుతారన్నారు.ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతో మంది రక్తం అందక చనిపోతున్నారని ప్రతి ఒక్కరు బాధ్యతగా రక్తదానం చేయాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా చంపాపేట్‌లోని కరుణశ్రీ సేవ సమైక్య ఆశ్రమంలో పాతబస్తీలోని అన్నదాత ఫౌండేషన్‌లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, అజయ్, ఎల్‌వీ సంజయ్‌కుమార్, పవన్, ప్రవీణ్‌కుమార్, కార్తీక్ రెడ్డి, ప్రతాష్‌గణేష్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాలకు బలవంతంగా లారీలను లాక్కోవద్దు



సీఐకి వినతిపత్రం ఇస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు

మన్సూరాబాద్: గణేష్ నిమజ్జనాలకు మా లారీలకు బలవంతంగా లాక్కోవద్దని కొత్తపేట బిల్డింగ్ మెటీరియల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు రవాణశాఖ కమిషనర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, నాగోలు ఆర్టీఏ, ఎల్‌బీనగర్ పోలీస్ ఇన్స్పెక్టర్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు నర్రి వెంకన్న, ప్రధాన కార్యదర్శి కుండె సత్తయ్య మాట్లాడుతూ.. ప్రతి లారీ తమ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటాయని లారీలను దారిలో ఆపి గణేష్ నిమజ్జనాలకు బలవంతంగా పంపడం సమంజసం కాదన్నారు. డ్రైవర్ చెప్పిన వినకుండా లారీ డాక్యుమెంట్లు లాక్కొని నిమజ్జనానికి తరలిస్తున్నారన్నారు. జనసాంద్రత గల ప్రాంతాల్లో 12,14, 16 టైర్ల భారీ వాహనాలను నడపడం ప్రమాదకరమని అధికారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో అంజయ్య, లింగం, మందుల సత్తయ్య, ఐతగోని యాదయ్య, మల్లేష్, నర్సింహా, మాలిగ లింగయ్య ఉన్నారు.

నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు

మున్సిపల్ కమిషనర్ సునీత



షాద్‌నగర్: బొబ్బిలి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ సునీత

షాద్‌నగర్: వినాయక నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సునీత తెలిపారు. శుక్రవారం ఆమె పట్టణ శివారులోని బొబ్బిలి చెరువు, పెరుమాళ్ల చెరువుల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భక్తి శ్రద్ధలతో ఘనంగా పూజలు అందుకున్న గణనాథులను ఘనంగా గంగమ్మ ఒడికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. చెరువుల వద్ద క్రేన్‌లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటుగా, దారి వెంట ఉన్న కంప చెట్లను తొలగిస్తున్నామన్నారు. నిమజ్జనానికి ఎటువంటి ఆటంకం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయంగా ముందుకు వెళ్తున్నామన్నారు.

చెరువులవద్ద లైటింగ్

షాద్‌నగర్‌రూరల్: గణనాథుల నిమజ్జనానికి ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ చెరువును శుక్రవారం ఎంపీడీఓ బన్సీలాల్, పట్టణ సీఐ విజయ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులవద్ద భక్తులకోసం చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని బొబ్బిలి చెరువు, మండల పరిధిలోని బుచ్చిగూడ, దూసకల్ చెరువులవద్ద నిమజ్జనం కోసం కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని వివరించారు. చెరువులవద్ద లైటింగ్, టెంట్, క్రేన్ వసతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో మండప నిర్వాహకులు, భక్తులు అధికారులకు పూర్తి సహాయసహకారాలను అందించాలని కోరారు. చెరువులను పరిశీలించిన వారిలో ఎస్ఐ సుశీల, ఎంపీఓ జయంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆరాధన తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీక

కడ్తాల్: దేవాలయాలు మన ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకలని టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గానుగుమార్లతండా గ్రామ పరిధి పోచమ్మగడ్డతండాలో నిర్మాణంలో ఉన్న తుల్జాభవానీ మాత ఆలయాన్ని శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి సందర్శించి మాట్లాడారు. హామీ మేరకు ఆలయానికి రూ.1 లక్ష విరాళం అందజేశానని తెలిపారు. మరింత సహకారం ఇస్తానని చెప్పారు. అనంతరం ఆలయ నిర్వాహకులు దాతను సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్, నాయకులు బీచ్యానాయక్, నరేశ్, రాజు, శ్రీను, రతన్, శివ, మహేశ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం వివక్షతోనే కొరత

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి



మాట్లాడుతున్న పాండురంగారెడ్డి



పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

కందుకూరు: కేంద్ర ప్రభుత్వం వివక్షతోనే యూరియా కొరత ఏర్పడిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అందుగుల సత్యనారాయణ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్రం అసమర్థతతో యూరియా దిగుమతి జాప్యం అవుతోందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా సరఫరాలో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని అవగాహన లేని బీఆర్‌ఎస్ నాయకులు కేంద్రాన్ని ప్రశ్నించకుండా, రైతులను రెచ్చగొట్టేలా కాంగ్రెస్‌ను నిందిస్తున్నారన్నారు. రైతులకు ఇప్పటి వరకే 7.32 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ప్రజా ప్రభుత్వం ద్వారా పంపిణీ జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో యూరియా కొరత ఉందన్నారు. తెలంగాణలో మాత్రమే యూరియా కొరత ఉన్నట్లు బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో రైతులకు బేడీలు వేసిన ఘటనలు మరిచి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతులు ఆలోచించాలని కోరారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు బాబురావు, గణేశ్ నాయక్, మహేందర్ పాల్గొన్నారు.

టోకెన్ల వారీగా యూరియా పంపిణీ

కందుకూరు పీఏసీఎస్ కార్యాలయం ఆవరణంలో పోలీసు బందోబస్తు మధ్య టోకెన్ల వారీగా అధికారులు రైతులకు యూరియా పంపిణీ చేశారు. శుక్రవారం 500 బస్తాల యూరియా సరఫరా కాగా 250 మందికి టోకెన్ల ద్వారా సీఐ సీతారామ్, ఏఓ లావణ్య ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. శనివారం మరో 500 బస్తాల యూరియా రానుందని, మిగతా రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

కేజీరెడ్డి కళాశాలలో జాతీయ సదస్సు

మొయినాబాద్: బలమైన గ్రామీణ, నగర సమదాయాల కోసం స్థిరమైన నీటి, వ్యర్థాల పరిష్కారాలు అనే అంశంపై సెప్టెంబర్ 2 నుంచి 4 వరకు నిర్వహించే జాతీయ సదస్సును విజయవంతం చేయాలని సమన్వయ కర్త సౌమ్య సుచరిత సింఘ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాధునిక పరిజ్ఞానం, సాంకేతికతలు, ఉత్తమ పద్ధతులు పరస్పరం పంచుకోవడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే ఈ జాతీయ సదస్సులో విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణులు, పరిశోధకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెరువుల సర్వేకు చర్యలు



పెద్దకుంటను పరిశీలిస్తున్న ఏఈ మహేందర్‌రెడ్డి తదితరులు

కడ్తాల్: చెరువులు, కుంటలపై ఫిర్యాదులు అందాయని, ఈ నేపథ్యంలో వాటి సర్వేకు చర్యలు చేపట్టామని ఇరిగేషన్ ఏఈ మహేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పెద్దకుంట, ఎలిగకుంట, దేవర చెరువు, కుమ్మరి కుంటలను పరిశీలించి మాట్లాడారు. ఎడతెరిపి లేని వర్షాలతో చెరువుల పరిస్థితిని తెలుసుకునేందుకు పర్యటిస్తున్నామని తెలిపారు. ఫిర్యాదులు చేసిన వ్యక్తులు కూడా తమతో పాటు రావాలని, ఎక్కడైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలని కోరారు. ఎలిగకుంటలోకి వచ్చే ఓవర్‌ఫ్లో మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని బటర్‌ఫ్లైవెంచర్ నిర్వాహకులకు ఆయన సూచించారు.

తరగతి గదులు.. తరగని గనులు

సైకాలజిస్ట్ రాధాకృష్ణరావు



రాధాకృష్ణారావును సన్మానిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

కేశంపేట: విద్యార్థులు ఉన్నతాశయాలతో లక్ష్యాలను చేరుకోవాలని సైకాలజిస్ట్ మందుమల రాధాకృష్ణారావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణరావు మాట్లాడుతూ.. తరగతి గదులు తరగని గనులన్నారు. విద్యార్థులు ఎంత చదువుకున్న ఇంకా నేర్చుకోవాల్సింది ఉంటుందన్నారు. పరీక్షలను పండుగ రోజులుగా మార్చుకోవాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయవద్దన్నారు. అనంతరం కళాశాల సిబ్బంది రాధాకృష్ణరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ హమీద్, కళాశాల లెక్చరర్లు నారాయణ, అశిపొద్దీన్, లక్ష్మీరాజ్, ధ్రువవకుమార్, మల్లేష్, శ్రీకాంత్, భారత్, నాగయ్య, రాణి, శిరీష, నర్సింలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ

- రైతులు నానో యూరియానే వాడాలి
- మండల వ్యవసాయాధికారి రేణుక



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

ఆమనగల్లు: సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియాతో రైతులకు చాలా మేలు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని తలకొండపల్లి మండల వ్యవసాయాధికారి రేణుక చక్రవర్తిని అన్నారు. నానో నేల సారాన్ని కాపాడుతూ.. దిగుబడిని పెంచేందుకు సహకరిస్తుందని చెప్పారు. శుక్రవారం తలకొండపల్లి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆమె పరిశీలించారు. రైతులకు నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ.. యూరియాను అధికంగా వాడటం వలన నేలసారం దెబ్బతింటుందని, పంట ఉత్పత్తి వ్యయం పెరుగుతుందని చెప్పారు. యూరియా ఒక ఎకరానికి 45 కిలోలు వాడాల్సి ఉండగా.. నానో 500 మి.లీ. వాడితే చాలని పేర్కొన్నారు. పంట నెల రోజుల వయసు ఉన్న సమయంలో నానో యూరియాను ఆకులపై పిచికారీ చేయడం వలన మొక్కలు.. అవసరమైన నత్రజని పదార్థాన్ని సులభంగా గ్రహిస్తాయని, దీనివలన 10 నుంచి 15 శాతం దిగుబడి పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

ఆలయాల అభివృద్ధికి ‘ఐక్యత’ విరాళం

ఆమనగల్లు: ఆలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ సహకారం అందిస్తుందని టాస్క్ సీఓఓ, ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి రాంనుంతల గ్రామం పరిధి చిన్నతండాలో నిర్మాణంలో ఉన్న తుల్జామాత దేవాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రూ.2 లక్షల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, శ్రీనునాయక్, మాజీ ఎంపీటీసీ పంతునాయక్, నాయకులు జింతనాయక్, పిక్లనాయక్, పరమేశ్, బన్సిలాల్, యాదయ్య, బాస్కర్ పాల్గొన్నారు.